సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 10 । జూలై । 2025



ఇరుకు వీధుల్లో.. స్వామి విహారమా!
ఏళ్ల నాటి సౌమ్యనాథుడి ఆలయం అభివృద్ధిలో వెనుకబడుతోంది. మాడ వీధులు ఇరుకుగా మారాయి. ఆలయం టీటీడీలో విలీనమైనా మాడవీధులు విస్తరణ జరగలేదు. - 4లో



జగన్ పర్యటనలో ఆంక్షలు ఎందుకు?
రైతుల కష్టాలను తెలుసుకుని ప్రభుత్వానికి కళ్లు తెరిపించడానికి వైఎస్ జగన్ వస్తే ఇన్ని ఆంక్షలు పెట్టడం ఏమిటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. - 4లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.180	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1098 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఆగస్టులో 50 క్యూసెక్కుల నీటి విడుదల



కాలువలో చెత్తను శుభ్రం చేస్తున్న సిబ్బంది

గాలివీడు : వైఎస్సార్ వెలిగల్లు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.7 క్యూసెక్కుల నీరు నిల్వ ఉంది. ఆగస్టు మొదటి వారంలో కుడి కాలువ ద్వారా 50 క్యూసెక్కులు రైతుల కోసం దాదాపు రెండు మసాల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజక్టు డీఈ శిరీష్ కుమార్ తెలిపారు.అందులో భాగంగా కాలువలో పేరుకుపోయిన జమ్ము, చెత్తను జేసీబీ యంత్రాల సాయంతో శుభ్రం చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివనారాయణ

ఓబులవారిపల్లె : ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా రైతులను ప్రోత్సహించి, అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. బుధవారం ముక్కవారిపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా రైతు సేవా కేంద్రాల సిబ్బంది వద్ద ఉందని, రైతులు పరిశీలించుకోవచ్చని చెప్పారు. అధికారిణి మల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్ నమోదుకు 12 వరకు అవకాశం



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబు

రాయచోటి జగదాంబసెంటర్ : రెండు సంవత్సరాల డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ) కోర్సుకు జరిగిన ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు డైట్‌లో సీటు పొందడానికి ఆన్‌లైన్ వెబ్ ఆధారంగా ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు ఈ నెల 9 నుంచి 12 వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు తెలిపారు. బుధవారం రాయచోటిలోని డైట్ విద్యా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకున్న వారికి సీట్లు కేటాయించి ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 25 నుంచి డైట్‌లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయన్నారు. రాయచోటి డైట్ తెలుగు మీడియంలో 50, ఆంగ్ల మాధ్యమంలో 50, ఉర్దూ మాధ్యమంలో 50 సీట్లు ఉన్నాయన్నారు. డీఈఈసెట్‌లో సాధించిన మార్కులు, రిజర్వేషన్ల ఆధారంగా రెండేళ్ల డీఈఎల్ఈడీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు డైట్ సీనియర్ లెక్చరర్ మడితాడి నరసింహారెడ్డిని (9440246825 నంబర్‌లో) సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, డైట్ లెక్చరర్స్ వైసీ రెడ్డప్పరెడ్డి, తిరుపతి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో రెండు కోర్సులకు అనుమతి

– డాక్టర్ ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి 2025–26 విద్యా సంవత్సరానికి బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ (బి.డిజైన్), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్సు ఆర్ట్స్ (బీఎఫ్ఏ) కోర్సుల్లో మెరిట్ ఆధారంగా నేరుగా అడ్మిషన్లు ఇచ్చేందుకు అనుమతి వచ్చిందని డాక్టర్ ఏఎఫ్‌యూ వీసీ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు. ఏపీఎస్‌సిహెచ్‌ఈ చైర్మెన్ ప్రొఫెసర్ మధుమూర్తి ఆదేశాల ప్రకారం యూనివర్సిటీ బ్యాచిలర్ ఆఫ్ ఫైన్సు ఆర్ట్స్ విభాగాలైన పెయింటిగ్ ఫొటోగ్రఫీ, యానిమేషన్, స్కల్ప్చర్ అప్‌లైడ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో సీట్లను నేరుగా అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయవచ్చని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి అర్హత పొందిన అభ్యర్థులను సంబంధింత కోర్సుల్లో మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు.

అంతా కమర్షియల్!

- రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంప్ డ్యూటీకి ఎగనామం
- కమర్షియల్ భవనం రెసిడెన్షియల్ అయ్యింది
- రూ.7.43 కోట్ల ప్రభుత్వ మార్కెట్ విలువను రూ.3.61 కోట్లుగా మార్చేశారు
- రూ.48.30 లక్షల స్టాంప్ డ్యూటీకి చెల్లించింది రూ.23.51 లక్షలే
- రూ.28.60 లక్షల ప్రభుత్వ ఆదాయానికి గండి



రెసిడెన్షియల్ కింద రిజిస్ట్రేషన్ జరిగిన భవనం

మదనపల్లె : మదనపల్లె సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గత ఏడాది నవంబర్‌లో జరిగిన రిజిస్ట్రేషన్ల వ్యవహారానికి సంబంధించి రిజిస్ట్రేషన్ అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. రిజిస్ట్రేషన్‌ను జరిగిన తీరును పరిశీలిస్తే అన్ని తెలిసిన అధికారులు ఆమోదముద్ర వేసి ప్రభుత్వానికి దక్కాల్సిన లక్షల ఫీజుకు కన్నం పెట్టారని అర్థమవుతుంది. ప్రస్తుతానికి వెలుగులోకి వచ్చిన మదనపల్లె హాస్పిటల్ రిజిస్ట్రేషన్ ఉదంతం వివరాల్లోకి వెళ్తే.



2000లో మదనపల్లె పట్టణం సీటీఎంరోడ్డులో ఓ పెద్ద భవనం నిర్మించి అందులో 'మదనపల్లె హాస్పిటల్'అనే ప్రైవేటు ఆస్పత్రిని ప్రారంభించారు. దీనికి అప్పటినుంచే మున్సిపల్ రికార్డుల్లో నాన్ రెసిడెన్షియల్ పేరుతో నమోదై కమర్షియల్‌గా పన్ను విధిస్తోంది. పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న భవనాలన్నీ కమర్షియల్ కిందకు వస్తాయి. 2019 నుంచి 2025 జనవరి వరకు మదనపల్లె పట్టణంలో ప్రభుత్వం నిర్ణయించిన విలువ మేరకు కమర్షియల్ చదరపు గజం రూ.27,170, రెసిడెన్షియల్ చదరపు గజం రూ.9,030. ఈ లెక్కన విలువకట్టి దానికి తగ్గట్టు స్టాంప్ డ్యూటీ విధించి, రిజిస్ట్రేషన్ ఫీజును ఖజానాకు జమ చేయాలి. అయితే గత ఏడాది నవంబర్‌లో ఈ భవన యజమాని మరొకరికి విక్రయించారు. ఈ వ్యవహారంలో కమర్షియల్ భవనాన్ని రెసిడెన్షియల్‌గా మార్చేశారు.

రెండుగా విడగొట్టి..

ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ అధిక మొత్తంలో ఉంటుందని ముందుగానే అధికారులతో లెక్క కట్టినట్టుంది. మదనపల్లె హాస్పిటల్ భవనాన్ని రెండుగా విడగొట్టారు. ఒక రిజిస్ట్రేషన్‌లో భవనం శిథిలావస్థలో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం 1633.5 చదరపు గజాలుగా చూపారు. కమర్షియల్ మేరకు..మార్కెట్ విలువ చదరపు గజానికి రూ.27,170 ఉండగా, నివాస భవనంగా చూపించి చదరపు గజం రూ.9,030కే లెక్క కట్టి ఈ విస్తీర్ణం విలువ రూ.1.82 కోట్లుగా పత్రాల్లో రాశారు. కమర్షియల్‌గా లెక్కిస్తే..దీని వాస్తవ విలువ రూ.4,43,82,195 అవుతుంది. ఇందులోని భవనాల వాస్తవ మార్కెట్ విలువ రూ.2.02 కోట్లు అయితే దీని విలువ రూ.1,47,50,505గా చూపించారు. ఈ రెండింటి విలువ రూ.6,45,82,195 అయితే రూ.3,29,50,505గా నిర్ణయించారు. ఇదే భవనం చుట్టూ ఉన్న 358 చదరపు గజాలున్న ఖాళీ స్థలానికి మరో రిజిస్ట్రేషన్ చేశారు. ఇది కమర్షియల్ పరిధిలోకి వస్తున్నప్పటికి రెసిడెన్షియల్ కింద చదరపు గజం రూ.9,030తో రూ.32,33,000 విలువ కట్టారు. వాస్తవంగా రెండు కలిపి ఒకే రిజిస్ట్రేషన్ జరగాలి. అలా జరిగి ఉంటే ఈ రెండు రిజిస్ట్రేషన్ అసలు విలువ రూ.7,43,09,195 అవుతుంది. కాని అధికారులు అలా వ్యవహరించలేదు.

వాస్తవాలు దాచి..

రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదైనా క్రయ విక్రయాలుంటే సంబంధిత సర్వే నంబర్లు, వాటి ప్రాంతం ఆధారంగా కమర్షియల్ లేదా రెసిడెన్షియల్ గుర్తించి చెల్లించాల్సిన వివరాలను సబ్ రిజిస్ట్రార్ నుంచి వివరాలు తీసుకున్నాక డాక్యుమెంట్ రైటర్లు పత్రాలు సిద్ధం చేస్తారు. ఇది మదనపల్లె హాస్పిటల్ భవనానికి ఎందుకు వర్తింపజేయలేదో డాక్యుమెంట్ రైటర్‌కే తెలియాలి. ఒకే స్థలం, భవనం ఉన్న ఆస్తికి ఒకే రిజిస్ట్రేషన్, ఒకే మార్కెట్ విలువ వర్తించేటప్పుడు ఆ విషయాన్ని పక్కదారి పట్టించి రెండుగా విడగొట్టారు.

జాబితాలో తొలగింపు

ఈ ఆస్పత్రి భవనం నిన్నటిదాకా కమర్షియల్ లెక్కలో ఉండగా ఇప్పుడు మున్సిపల్ అధికారులు తొలగించేశారు. పట్టణంలో వాణిజ్య భవనాల ఇంటి నంబర్లతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపిన నివేదికలో ఈ భవనం కమర్షియల్ జాబితాలో లేదు. దీని పక్కన ఉండే కమర్షియల్ భవనాలను జాబితాలో చూపించారు. 2000 ఏడాది నుంచి కమర్షియల్ విభాగం కింద రూ.1.17 లక్షల పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ఇచ్చిన నివేదికలో ఈ ఇంటి నంబర్ ఎందుకు లేదో వారికే తెలియాలి. ఈ జాబితాలో తొలగించాక రిజిస్ట్రేషన్ జరిగిందా లేక ఆ తరవాత తొలగించారా అన్నది తెలియరాలేదు.

రూ.28.60 లక్షలకు గండి

కమర్షియల్ భవనాన్ని రెసిడెన్షియల్‌గా చూపడమే కాకుండా విలువను తగ్గించేయడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.28,60,080 గండి కొట్టారు. భవనం, దానికి చెందిన స్థలానికి, ఖాళీ స్థలానికి ప్రభుత్వ మార్కెట్ విలువను కట్టి రిజిస్ట్రేషన్ చేసివుంటే రూ.48,30,895 స్టాంప్ డ్యూటీ, రూ.7,43,100 రిజిస్ట్రేషన్ ఫీజు ఖాజానాకు చేరాలి. అధికారులు కుమ్మక్కు కావడంతో మార్కెట్ విలువను తగ్గించి క్రయ విక్రయదారులకు సహకరించినందువల్ల రూ.28,60, 080 ఆదాయానికి నష్టం వాటిల్లింది. భవనం, దాని స్థలానికి సంబంధించి రూ.41,97,895 స్టాంప్ డ్యూటీకి బదులు రూ.21,41,820 కట్టా రు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.6,45,830కి బదులు రూ.3,29,510 కట్టారు. ఖాళీ స్థలానికి సంబంధించి మార్కెట్ విలువ రూ.97,27,000కు బదులు రూ.32,33,000కు, స్టాంప్ డ్యూటీ రూ.6,33,000కు బదులు రూ.2,10,150కి, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.97,270కి బదులు రూ.32,330 గా మార్చేశారు. దీనివల్ల రిజిస్ట్రేషన్లశాఖ నష్టం జరగడమేకాక, మున్సిపాలిటీకి దక్కాల్సిన 1.5 శాతం ఆదాయం కోల్పోయింది.

ఇవి అసలు నిబంధనలు

విలువ తగ్గింపుపై రిజిస్ట్రేషన్లశాఖ వర్గాలు తెలిపిన మేరకు..ఒకే స్థలంలో ఉన్న భవనానికి, స్థలానికి వేర్వేరుగా రిజిస్ట్రేషన్ చేయరాదు. మున్సిపల్ లెక్కల ప్రకారం మదనపల్లె హాస్పిటల్ భవనం కమర్షియల్ భవనంగా మనుగడలోకి వచ్చింది 2000 ఏడాదిలో. అంటే ఇప్పటికి దాని వయసు 24 ఏళ్లయినట్టు. రిజిస్ట్రేషన్ నిబంధనల ప్రకారం నిర్మాణం జరిగిన 20 ఏళ్ల తర్వాతే ఫీజులో తగ్గింపు లభిస్తుంది. అదికూడా నూటికి ఒకశాతం మాత్రమే. అంటే మదనపల్లె హాస్పిటల్ భవనానికి నాలుగేళ్లకు లభించే రాయితీ నామమాత్రమే. అయితే ఏకంగా రూ.28.60 లక్షలు తగ్గించేసి రెసిడెన్షియల్‌గా రెండు రిజిస్ట్రేషన్ చేయడం జరగదని రిజిస్ట్రేషన్‌శాఖ వర్గాలు స్పష్టంగా చెబుతున్నాయి.

తగ్గించాకే ఈ విలువ : సబ్ రిజిస్ట్రార్

మదనపల్లె హాస్పిటల్ భవన విక్రయ రిజిస్ట్రేషన్ చేసింది తానేనని సబ్ రిజిస్ట్రార్ గురుస్వామి వివరణ ఇచ్చారు. భవన నిర్మాణం జరిగి 30 ఏళ్లయినందున నిబంధనల ప్రకారం తగ్గిన విలువతో.. క్షేత్రస్థాయిలో భవనాన్ని పరిశీలించాక రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న భవనం కావడంతో వాస్తవానికి వసూలు చేసిన ఫీజు ఎక్కువని చెప్పారు. ఆదాయానికి నష్టం కలగలేదని చెప్పారు. ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన కమర్షియల్ జాబితాలో ఈ భవనం ఇంటి నంబర్ లేదని స్పష్టం చేశారు.

చెత్తసేకరణ కోసం ట్రై సైకిల్స్

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి




తక్కువ ఖర్చుతో తయారు చేసిన చెత్త సేకరణ వాహనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : చెత్త సేకరణ సామర్థ్యాన్ని పెంచేందుకు తక్కువ ఖర్చుతో ట్రై సైకిల్స్ తయారు చేయించామని, గ్రీన్ అంబాసిడర్లకు తక్కువ శ్రమతో ఎక్కువ కుటుంబాల నుంచి చెత్త సేకరణ చేసేలా వాహనాన్ని చేయించామని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన హర్షవర్ధన్ ద్విచక్ర వాహనాన్ని కొంతమార్పి లక్ష రూపాయల ఖర్చుతో తయారు చేసిన చెత్త సేకరణ ట్రై సైకిల్ వాహనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాహనం జీవితకాలం, మైలేజ్, ఎన్ని కేజీల బరువును మోయగలదు తదితర విషయాలను హర్షవర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. డీజిల్ ఆటో ఖర్చు, మెయింటినెన్స్ ఖర్చులతో పోలిస్తే నూతనంగా తయారు చేయించిన వాహనం తక్కువ ఖర్చుతో ఎక్కువ కుటుంబాల నుంచి చెత్తసేకరణ సాధ్యమవుతుందన్నారు. ఈ వాహన సామర్థ్యం, మైలేజ్, వాహన పనితీరు తదితర వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని జిల్లా పంచాయతీశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

- వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సూచించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పనితీరుపై ప్రజల నుంచి సేకరించిన వివిధ అంశాలపై జిల్లా డీఎంహెచ్ఓ, మెడికల్ ఆఫీసర్లు తదితరులతో కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు ప్రజలతో మానవతా దృక్పథంతో మెలగాలన్నారు. ప్రజల నుంచి సిబ్బంది ప్రవర్తనపై అభిప్రాయాలను సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీ నరసయ్య, డీపీఎంఓ డాక్టర్ రియాజ్ బేగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ (రాజంపేట) డాక్టర్ శేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్‌బీఎస్‌కె డాక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్స్ మీట్‌పై టీచర్లకు షరతులు

- మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ కోసం ప్రభుత్వం హడావుడి
- వారం రోజులుగా బోధనకు దూరంగా ఉపాధ్యాయులు



మదనపల్లె సిటీ : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహణపై విద్యాశాఖ అధికారులు షరతులు విధించారు. జిల్లాలో 201 యూపీ , 252 జెడ్పీ ఉన్నత, 1,677 ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం 9 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుంది లేనిది ఇతర శాఖ ఉద్యోగి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ ఉద్యోగి మెగా పీటీఎం రోజున 30 సెకన్ల వీడియో, నాలుగు ఫొటోలు, మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రధానోపాధ్యాయులు ఉపయోగిస్తున్న లీప్‌యాప్‌లో సాక్షిగా వచ్చిన వ్యక్తి అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు షరతు విధించారు. విద్యాశాఖ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.


యాప్‌ల భారంతో సతమతం

ఉపాధ్యాయులకు యాప్‌ల భారం తగ్గించి అన్ని యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, సరికొత్త యాప్ రూపొందిస్తామని విద్యాశాఖ మంత్రి లోకేష్ ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన తొలి సమావేశంలో ప్రకటించారు. లీప్ యాప్‌ను రూపొందించినా రోజూ మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం నిర్వహణ వంటి కార్యక్రమాలతో పాటు స్టాక్ అందిన ప్రతిసారి పాత ఐఎంఎంఎస్‌లో నమోదు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇటీవల పాఠశాలలకు అందిస్తున్న సన్నరకం బియ్యంపై ఉన్న క్యూర్ కోడ్‌ను స్టాక్ అందిన వెంటనే స్కాన్ చేయాలి. తర్వాత బస్తా ఓపెన్ చేసిన వెంటనే స్కాన్ చేయాలి. విద్యార్థులకు మొక్కలు, ఆపార్ ఐడీ క్రియేట్ వంటి అనేక ఆన్‌లైన్ కార్యక్రమాలతో బోధనకు దూరమవుతున్నాంటూ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బోధనకు దూరంగా టీచర్లు

నిన్న యోగాంధ్ర...నేడు పేరెంట్స్ మీట్ అంటూ టీచర్లను సమావేశాలకు,సన్నాహాలకు పరిమితం చేస్తుండటంతో వారు బోధనకు దూరవుతున్నారు. రెండు వారాల నుంచి తల్లిదండ్రుల సమావేశమంటూ హంగామా చేస్తున్నారు. హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డుల పేరిట చాంతాడంత డేటాను పూరిస్తున్నారు. దీంతో విద్యాబోధన రెండు అడుగులు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది.

ఉపాధ్యాయుల పనితీరు కించపరచడమే



మెగా పీటీఎంకు ఇతర శాఖ ఉద్యోగుల పర్యవేక్షించడం ఉపాధ్యాయులను కించపరచడమే. బాహ్య పరిశీలకుల పేరిట ఇతర శాఖ ఉద్యోగులను నియమించడం పాఠశాల నిర్వహణ వ్యవస్థను అవమానించడమే. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

– పి.మధుసూదన్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

కదం తొక్కిన కార్మికులు



రాయచోటి : కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న కార్మికులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని నిరసన

రాయచోటి : లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ కార్మికులు కదం తొక్కారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల నినాదాలతో మిన్నంటింది. అంగన్వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ, మున్సిపల్, హమాలీ, బీడీ, విద్యుత్, సమగ్ర శిక్ష కార్మిక ఉద్యోగులు మాసాపేట నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. లేబర్ కోడ్‌లు అమలు చేస్తున్న బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్ ఎదుట రెండు గంటల పాటు బైఠాయించారు. కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు మాట్లాడుతూ లీడర్ కోడ్‌లు రద్దు చేయడం అంటే భారత రాజ్యాంగం మీద బీజేపీ చేస్తున్న దాడిగా పరిగణించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కార్మిక కర్షకులు సంఘటితమై దీర్ఘకాలిక పోరాటాలు చేయాలన్నారు. అంగన్వాడీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.బాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఐక్య పోరాటాలతో పాలకుల మెడలు వంచినప్పుడే కార్మిక చట్టాల పునరుద్ధరణ సాధ్యం అన్నారు. రాజంపేటలో వామపక్ష నాయకులు చేపట్టిన ర్యాలీ పాత బస్టాండులోని వైఎస్సార్ సర్కిల్ వద్దకు రాగానే పోలీసులు అడ్డగించారు. నిరసన తెలపరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు బీవీ రమణ, చెన్నయ్య, అక్బర్, శంకర్, గ్రామ పంచాయతీ కార్మికులు దేవరాయలు, ఏవీ రమణ, ఆంజనేయులు, ఆశా రమాదేవి సునంద, బీడీ నసీబ్‌జాన్, హమాలీ రవి, ఖాదర్, సమగ్ర శిక్ష ఆలీ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేటరూరల్ : ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

వైభవం..సౌమ్యనాథుడి గరుడోత్సవం



గరుడవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

నందలూరు : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు బుధవారం రాత్రి స్వామివారు శ్రీ మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గరుడవాహనసేవ దిగువవీధి, పేటగడ్డ, బస్టాండ్ మీదుగా ఆరవపల్లి వరకు సాగింది. గరుడసేవ తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు.ఆరవపల్లిలో శ్రీ ముత్తు మారెమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన విడిదిలో ఉభయదారులు కుర్ర మణి యాదవ్, ప్రభావతి దంపతులను మంగళవాయిద్యాలతో ఆహ్వానించి పూజలు జరిపించారు. బుధవారం ఉదయం పుష్పాలంకరణ ప్రియుడైన సౌమ్యనాథ స్వామి మోహిని అలంకారంలో శేషవాహనంపై మాఢవీధుల్లో విహరించారు. కడపకు చెందిన గణేష్ కోలాటం బృందం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



మహిళల కోలాట ప్రదర్శన

బ్రహ్మోత్సవాలలో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఫుట్‌బాల్ టోర్నీకి జిల్లా జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలికల జూనియర్, సబ్ జూనియర్స్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి వందకు మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 25 మందిని రెండు జట్లుగా ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 16 వతేదీ నుంచి కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు తాజ్‌బాషా, వెంకటరమణారెడ్డి, కమలేష్, మహేంద్రనాయక్, విష్ణు, అంజనప్ప,నరేష్, మోహన్‌రెడ్డి, బాలాజీ, ఉమాదేవి, లత తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జట్టుతో కోచ్‌లు

క్లుప్తంగా

సింహ వాహనంపై సిద్ధేశ్వర స్వామి



చెన్నకేశవ స్వామికి ఊంజల్‌సేవ

రాజంపేట : పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాకలో బుధవారం సిద్ధేశ్వరస్వామి సింహ వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. చెన్నకేశవ స్వామి హనుమంతు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తాళ్లపాక పుర వీధులలో ఊరేగించే క్రమంలో భక్తులు కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గౌరీశంకర్, బాలాజీ, భజనబృందాల సభ్యులు పాల్గొన్నారు. ఉదయం పల్లకీసేవతో పాటు ఊంజల్ సేవ నిర్వహించారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి



ప్రైవేటీకరణ ఆపాలంటూ ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

రాయచోటి టౌన్ : విద్యుత్తు సంస్థ ప్రైవేటీకరణ ఆపాలంటూ విద్యుత్తు ఉద్యోగుల సంఘం ఐక్య కార్యాచరణ సమితి నాయకులు(జెఏసీ) కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రాయచోటి ఎస్ఈ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, భాస్కర్‌నాయుడు, బాబర్ బేగ్, సుధాకర్ నాయుడు, వాసుదేవ రాజు, పాల్గొన్నారు.

పోలీసుల విచారణకు వస్తూ.. అస్వస్థతకు గురై

బద్వేలు అర్బన్ : బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నకిలీ పట్టాల కేసులో విచారణకు హాజరు అయ్యేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేల్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన నకిలీ ఇంటి పట్టాల కేసులో గత వారం రోజులుగా పోలీసులు పలువురినీ విచారిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని సుమిత్రా నగర్‌కు చెందిన డి.రవికుమార్‌ను రోజూ స్టేషన్‌కు పిలిచి రాత్రికి ఇంటికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కూడా విచారణ నిమిత్తం స్టేషన్ వద్దకు వచ్చిన రవికుమార్ తీవ్ర అస్వస్థతకు గురై కిందపడిపోయారు. పోలీసులు కుటుంబసభ్యులకు సమాచారమివ్వడంతో రిమ్స్‌కు తరలించారు. పోలీసులు తమను ఏమీ ఇబ్బంది పెట్టలేదని, భయాందోళనకు గురై నిద్ర మాత్రలు మింగారని రవికుమార్ కుటుంబీకులు తెలిపారు.

ఇరుకు వీధుల్లో.. స్వామి విహారమా!

- టీటీడీలో విలీనమైనా.. మాడ వీధుల విస్తరణ లేదు
- హైవేలో ప్రమాదాలతో దెబ్బతింటున్న ఆలయ ముఖద్వారం



నందలూరు బస్టాండులో ప్రమాదకరంగా కుంచించుకుపోయిన ఆలయ రహదారి

రాజంపేట : ఏళ్ల నాటి సౌమ్యనాథుడి ఆలయం అభివృద్ధిలో వెనుకబడుతోంది. మాడ వీధులు ఇరుకుగా మారి.. స్వామి స్వేచ్ఛ విహారానికి దారి లేని పరిస్థితి. ఆలయ ముఖద్వారం ప్రమాదాలతో తరచూ దెబ్బతింటోంది. మాస్టర్‌ప్లాన్ అటకెక్కింది. దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధ ఆలయాల్లో నందలూరు సౌమ్యనాథాలయం ఒకటి. 11వ శతాబ్దంలో చోళవంశరాజు కుళోత్తుంగచోళుడు ఈ ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ తొలి వైష్ణవ ఆలయం పదెకరాల విస్తీర్ణంలో 180 స్తంభాలు, వైఖానస, వైష్ణవగామ ఆర్షపోక్త వాస్తు యుక్తముగా నిర్మితమై ఉంది. ఇంత విశిష్టత కలిగిన ఈ ఆలయం అభివృద్ధిలో వెనుకబడి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేశారు. దీంతో తాజాగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఒంటిమిట్ట రామయ్య తరహాలో ఇక్కడ ఉత్సవ శోభ సంతరించుకుంది.

స్వామికి.. దారేది

సౌమ్యనాథాలయంలో మాఢ వీధులు కుచించుకుపోతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథుడు మాఢ వీధుల్లో ఊరేగుతుంటారు. వాస్తు శాస్త్రోక్తంగా ఒంటిమిట్ట తరహాలోనే ఆలయం అత్యంత సమీపంలో మాఢ వీధులను ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఆలయానికి ఓ వైపు ప్రధాన రహదారి(నందలూరు-టంగుటూరు), మరోవైపు అత్యంత సమీప వీధి కుచించుకుపోయింది. ఉత్తర వైపు వీధి విశాలంగానే ఉంది. తూర్పు గాలిగోపురం వీధిని విస్తరించాల్సి ఉంది. ఇంత విశిష్టత కలిగిన ఈ ఆలయంలో మాఢ వీధుల అభివద్ధిపై టీటీడీ దృష్టి సారించాల్సి ఉంటుంది. నందలూరు బస్టాండు నుంచి(టంగుటూరు రోడ్డు) ఇరువైపులా ఆక్రమణలతో ముందుకొచ్చారు. భక్తుల రాక క్రమంగా పెరుగుతుండడంతో వాహనాల నిలిపేందుకు స్థలం లేని పరిస్థితి. ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టి అద్దె వసూలు చేస్తున్నారు. అయితే రోడ్డు విస్తరణ గాలికి వదిలేశారు.

సర్వే చేసిన కేంద్రపురావస్తు శాఖ

సౌమ్యనాథాలయం చుట్టూ వంద మీటర్ల స్థలం కేంద్ర పురావస్తుశాఖ పరిధిలోకి వస్తుంది. గతంలో ఆ శాఖ వంద మీటర్ల వరకూ ఆలయం విస్తరించి ఉందని తేల్చడమేగాక, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కొలతలు వేసి తర్వాత విషయం ఆటకెక్కించారు. ఒంటిమిట్ట తరహాలో ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఆలయ స్థలాలు స్వాధీనం చేసుకుని వాహన మండపం, రథ మండపం, ఆఫీసు, అన్నదానసత్రం నిర్మాణానికి స్థలం కేటాయించాల్సి ఉంది. మరోవైపు నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని కడప-రేణిగుంట జాతీయ రహదారిపై సౌమ్యనాథాలయ ఆర్చి 2004లో నిర్మించారు. నిత్యం వాహనాలు ఆర్చిని ఢీకొనడంతో ప్రమాదంగా మారింది. నూతనంగా ఆర్చినిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

పది పరీక్ష పత్రాల మూల్యాంకన భత్యం చెల్లించాలి



ఏడీ రాజశేఖర్‌కు వినతిపత్రాన్ని ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

రాయచోటి టౌన్ : పదో తరగతి పరీక్షల నిర్వహణ, పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు వెంటనే టీఏ, డీఏలు, రెమ్యూనరేషన్ చెల్లించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ జాబీర్, ప్రధాన కార్యదర్శి గఫార్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో జరిగిన ఫ్యాప్టో సమావేశంలో వారు మాట్లాడుతూ 2025 ఏప్రిల్‌లో పదో తరగతి పరీక్ష ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యతలు నిర్వర్తించామని, పత్రాలను దిద్దామని.. ఇప్పటికీ పారితోషకం చెల్లించకపోడం అన్యాయమన్నారు. డీఈవో కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో రెండేళ్లుగా అరకొర చెల్లింపులు చేయడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నామన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో చైర్మన్ హరిబాబు, శివారెడ్డి, ఇలియాస్, రవిశంకర్, కోశాధికారి జఫరుద్దీన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలియం ట్యాంకర్ డ్రైవర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌పీసీఎల్ మేనేజర్ సతీష్‌కుమార్

సిద్దవటం : అతి వేగం ప్రమాదకరమని హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్ సూచించారు. పెట్రోలియం ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్‌లకు బుధవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని భాకరాపేట సమీపంలో హిందూస్థాన్ పెట్రోలియం ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ కంపెనీ నుంచి ట్యాంకర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించేటపుడు 60 కంటే వేగంతో వాహనాలు నడపరాదన్నారు. వాహనంలో ఫస్ట్ ఐడీ బాక్స్ ఉండాలని, ప్రతినెలా రెండు సార్లు వాహనం సర్వీసింగ్ చేయించాలని సూచించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని, కంపెనీ నియమ నిబంధనలను పాటించాలని కోరారు. డ్రైవర్లు ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెట్రోలియం ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటనలో ఇన్ని ఆంక్షలు ఎందుకు?

- రైతుల గోడును అణచి వేయాలనే.. ప్రభుత్వ వైఖరి
- ఎస్పీ స్థాయి అధికారులు లాఠీచార్జి చేయడం దుర్మార్గం
- వేలాది పోలీసులను మొహరించడం దేనికి సంకేతం?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

సాక్షి,అమరావతి : కష్టాలలో ఉన్న రైతులను పరామర్శించడానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెళ్తే.. ఏకంగా రైతులపై ఎస్పీ స్థాయి అధికారులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతంలో మిర్చి రైతుల సమస్యలపై, పొగాకు రైతుల గురించి ప్రతిపక్ష నేత జగన్ వెళ్లి మాట్లాడితే కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడిందన్నారు. మామిడి రైతుల కష్టాలను తెలుసుకునేందుకు ఈ రోజు చిత్తూరు జిల్లా బంగారుపాలెం పర్యటనకు వస్తున్నామని చెప్పడంతో రెండు మూడు రోజులుగా ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. ప్రతి పక్ష నాయకుడిగా రైతుల పడుతున్న కష్టాలను తెలుసుకుని ప్రభుత్వానికి కళ్లు తెరిపించడానికి జగన్ వస్తే ఇన్ని ఆంక్షలు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 500 మంది రైతులు మాత్రమే రావాలని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. అభిమాన రైతులు కష్టాలు చెప్పుకోవడానికి తరలివస్తుంటే అడ్డుకుని, కెమెరాలతో ఫొటోలు తీసుకుంటున్నాం..రౌడీ షీట్లు తెరుస్తాం..కేసులు పెడతాం అంటూ బెదిరించడం.. రైతులపై లాఠీచార్జి చేసి రక్త గాయాలయ్యేట్లు కొట్టడం తగదన్నారు. రాజ్యాంగాన్ని విస్మరించి, కక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ, సొంత రాజ్యాంగం సృష్టించుకుని రాచరిక, నియంత, సైనిక పాలన సాగించడం సరైన విధానం కాదన్నారు. వేలాది పోలీసులను మొహరించి, చెక్ పోస్టులు పెట్టి, రైతులను రానీయకుండా ఆపడం సరికాదన్నారు.

అధికారులను గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నారన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లె మండలంలో కేక్ కట్ చేస్తే, వారిని ఎస్పీ పోలీసు స్టేషన్ కు పిలిపించి, భయభ్రాంతులకు గురిచేయడం మంచి పద్ధతి కాదన్నారు. టమోటా,వరి, వేరుశనగ, ఖర్బూజా, దోస, అంతరపంటలకు, నేరేడు పంటలకు ఈ ఏడాది గిట్టుబాటుధర లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

వీరబల్లి : మండలంలోని మాండవ్య నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని మండల తహసీల్దారు ఖాజాబీ తెలిపారు. రాగిమానితా గడపల్లి వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. తహసీల్దారు స్పందించి వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను పంపి విచారించారు. అక్రమంగా తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని వారు హెచ్చరించారు.

కోనంపేటలో చోరీ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కోనంపేట టౌన్‌కు చెందిన కొర్లకుంట రామచంద్రయ్య ఇంట్లో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.లక్ష నగదు, బంగారు అపహరించుకుపోయినట్లు బాధితులు తెలియజేశారు. పొలం వద్ద మోటారు రిపేరు ఉండడంతో ఇంటికి తాళం వేసి వెళ్లామని, దొంగలు చొరబడి తాళం పగులగొట్టి నగదు, బంగారు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికుల నిరసన



ఏపీఎండీసీ గనుల్లో పనులను అడ్డుకొన్న కార్మికులు



సమ్మెతో మంగంపేటలో నిలిచిపోయిన వాహనాలు

ఓబులవారిపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ల అమలును అడ్డుకుంటామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మంగంపేట ఏపీఎండీసీ కార్యలయం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఉదయం ఏపీఎండీసీ కార్యలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించి.. గనుల్లో పనులను అడ్డుకున్నారు. త్రివేణి, ఏపీఎండీసీ కార్మికులు సమ్మెకు పూర్తి మద్దతుపలికారు. దీంతో పనులు నిలిచిపోగా డీస్పాచ్ ఆగిపోయింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చంద్ర శేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా సమ్మెలో పాల్గొన్నారన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వాహనాల్లో బ్యాటరీలు, డీజిల్ చోరీ



వాహనాల నుంచి బ్యాటరీలను దొంగిలించారని చూపుతున్న లారీ యజమాని

మదనపల్లె రూరల్ : పార్కింగ్ చేసిన వాహనాలకు సంబంధించిన బ్యాటరీలు, డీజిల్ పెద్ద మొత్తంలో చోరీ చేసిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. బాధితులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కదిరిరోడ్డు టిప్పుసుల్తాన్ మైదానంలో రాత్రి పెద్ద సంఖ్యలో వాహనాలను పార్కింగ్ చేస్తారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిలిపి ఉంచిన 30 లారీలు, మినీలారీలు, ట్రాక్టర్‌లు, టిప్పర్‌ల నుంచి బ్యాటరీలను దోచుకెళ్లారు. వాహనాల్లో డీజిల్ చోరీ చేశారు. వాటి విలువ సుమారు రూ.2లక్షలకు పైగా ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం టూటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి వాహనాలను పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

మండలానికి ఒక కిసాన్ డ్రోన్



శాఖరాజుపల్లెలో దోస పంట పరిశీలిస్తున్న చంద్రనాయక్

సిద్దవటం : ప్రతి మండలానికి 80 శాతం రాయితీపై ఒక కిసాన్ డ్రోన్ ఇస్తామని రైతు బృందాలు అధికారులను సంప్రదించాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు చంద్రనాయక్ తెలిపారు. సిద్దవటం మండలం శాఖరాజుపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్చింగ్ షీట్ పద్ధతిలో సాగు చేసిన దోస పంట పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు వివరించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు ఈకేవైసీ ఫింగ్ ద్వారా చేయించుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం సిద్దవటం వ్యవసాయ కార్యాలయంలో ఎరువుల పంపిణీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో రమేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్, మురళి, రైతులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్స్‌తో పటిష్ట నిర్మాణం



మేస్త్రీలకు బీమా పత్రాలు అందజేస్తున్న భారతి సిమెంట్స్ ప్రతినిధులు

గాలివీడు : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు కలిగిన భారతి సిమెంట్స్‌తో పటిష్ట నిర్మాణాలు చేపట్టవచ్చునని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీరు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి రమణారెడ్డి తెలిపారు. గాలివీడు నేషనల్ హార్డ్‌వేర్ సమీపంలో మేస్త్రీలకు సిమెంట్ వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్ ప్రతినిధులు మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటెక్ టెక్నాలజీతో తయారవుతోందని, అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. రోబోటిక్స్ ప్రయోగశాల, జర్మన్ టెక్నాలజీతో తక్కువ సమయంలో ఎక్కువ కట్టడాలు చేయగల సామర్థ్యం కలదన్నారు. ఇతర కంపెనీల సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రాఫాస్ట్ రెండు గంటల్లోనే సెట్ అవుతోందన్నారు. ధృడత్వాలు కలిగిన నిర్మాణాల భారతి సిమెంట్స్‌తోనే సాధ్యమని తెలిపారు. అనంతరం మేస్త్రీలకు లక్ష ఉచిత బీమా బ్యాండ్ బీమా పత్రాలను 50 మంది మేస్త్రీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ ఖాదర్‌ఖాన్, మేస్త్రిలు పాల్గొన్నారు.

చదువును కొనసాగించడానికి చక్కటి అవకాశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

రాయచోటి టౌన్ : చదువును మధ్యలో ఆపేసిన వారంతా సార్వత్రిక విద్యాపీఠం ద్వారా మళ్లీ చదువు కొనసాగించవచ్చని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను డీఈవో సుబ్రహ్మణ్యంతో కలిసి బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువును మధ్యలో ఆపేసిన వారు 14 ఏళ్లు పూర్తి చేసిన వారికి ఇది మంచి అవకాశమని చెప్పారు. పది, ఇంటర్ పాఠ్య పుస్తకాలతో పాటు సులభతరమైన పుస్తకాలు అభ్యాసకుల ఇంటికే ఉచితంగా పంపించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులకు జులై 30 చివరి రోజు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరాజు, అబ్బవరం మధుసూదన్, వీరబల్లె ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఏసీఏ అండర్-19 మల్టీడే మ్యాచ్



కెహెచ్.వీరారెడ్డి (133 పరుగులు)



అర్దిత్‌రెడ్డి (100 పరుగులు)



మహిత్ (4 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం వైఎస్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్లు తలపడ్డాయి. తొలి ఇన్నింగ్స్‌లో 461 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కడప జట్టు 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని అర్దిత్ రెడ్డి 76 బంతుల్లో సెంచరీ చేశాడు. అనంతపురం జట్టులోని కెహెచ్.వీరారెడ్డి 4 వికెట్లు, నవదీప్ 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 67 ఓవర్లకు 250 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కెహెచ్.వీరారెడ్డి 177 బంతుల్లో 133 పరుగులు, సాత్విక్ 41 పరుగులు చేశాడు. కడప జట్టులోని ధీరజ్ కుమార్ రెడ్డి 4 వికెట్లు, అర్దిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 15 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసింది. కడప జట్టు 319 పరుగుల అధిక్యంలో కొనసాగుతున్నది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కెఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో 11 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు మ్యాచ్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 63.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి చరణ్ 63 పరుగులు, బాలాజీ 55 పరుగులు చేశారు. కర్నూలు జట్టులో మహిత్ 4 వికెట్లు, మల్లి ఖార్జున 2 వికెట్లు, విఖ్యాత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 28 ఓవర్లకు 2 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. ఆ జట్టులోని మురళీ హృదయ్ 60 పరుగులు, కెవి ఓంకార్ 43 పరుగులు చేశారు. కర్నూలు జట్టు 174 పరుగుల అధిక్యంలో కొనసాగుతోంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

నేడు పెన్షన్ అదాలత్

కడప సెవెన్‌రోడ్స్ : వెబెక్స్ వేదికగా గురువారం ఉదయం 11.30 గంటలకు పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కడప రీజినల్ కార్యాలయ సీపీఎఫ్ కమిషనర్ అభిషేక్ ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే మూడు నెలల్లో పెన్షనర్లు కాబోయే ఈపీఎస్ 1995 సభ్యులు కూడా అదాలత్‌తో తమ ఫిర్యాదులకు సమాధానాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. నిబంధనలు అర్థం చేసుకోవడానికి, ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి, ఈపీఎఫ్ఓ అధికారులతో సన్నిహితంగా ఉండడానికి ఇది ప్రత్యేక వేదిక అని తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు-గిద్దలూరు రహదారిపై ఎస్ఎస్ఎస్ సెల్‌ఫోన్ దుకాణంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారని దుకాణం యజమాని నాగూర్‌వలి తెలిపారు. రూ.50 వేల విలువైన ఐదు సెల్ ఫోన్లు, రూ.5 వేల విలువ చేసే బ్లూటూత్, సీసీ కెమెరా, రూ.15 వేల నగదు చోరీ చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. రాజంపేట నుంచి కొమ్మేమర్రి గ్రామానికి వాహనంలో ప్రయాణిస్తుండగా ముందువైపు వెళ్తున్న వాహనం బ్రేక్ వేయడంతో దానిని ఢీకొని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రజాక్, గోవిందమ్మ, మద్దిలేటమ్మ, శివమ్మ గాయపడగా 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావాలి



ఖైదీలతో మాట్లాడుతున్న జైళ్లశాఖ డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ అంజనీకుమార్

మదనపల్లె రూరల్ : ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకువచ్చేందుకు జైలు సిబ్బంది కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టరేట్ ఆఫ్ జనరల్ అంజనీకుమార్ అన్నారు. మదనపల్లె సబ్ జైలు, డీఎస్పీ మహేంద్రతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఖైదీలతో ప్రత్యేకంగా మాట్లాడి జైలులో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. జైలు గదులు, మరుగుదొడ్లు పరిశీలించి, మూడు నెలలకు పైగా జైలులో ఉన్న ఖైదీల వివరాలు, బెయిల్ మంజూరైనా, బయటకు వెళ్లని ఖైదీల సమాచారం, ఉచిత న్యాయసేవలపై జైలర్ లక్ష్మణరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేరాలకు పాల్పడి జైలుకు వచ్చిన ఖైదీలలో మార్పు రావాలన్నారు. సత్ప్రవర్తన దిశగా వారు వెళ్లేలా జైలు అధికారులు చొరవ చూపాలన్నారు. ఆయన వెంట వన్‌టౌన్ సీఐ ఎరీషావలీ, తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టికోసం.. తమ్ముళ్ల పోరు

- కడప ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఘర్షణ
- చమర్తి-మేడా బాబు వర్గీయుల మధ్య ప్రతిదాడులు
- ఇరు వర్గాలపై కేసు నమోదు చేసిన సీఐ బాబు

ఒంటిమిట్ట : మండలంలో తెలుగు తమ్ముళ్ల వర్గ పోరు తారస్థాయికి చేరింది. స్థానిక హరిత హోటల్ వద్ద మట్టి కోసం తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట మరువకముందే బుధవారం మళ్లీ అదే వర్గానికి చెందినవారు ఘర్షణకు దిగారు. చెరువు మట్టి తరలించేందుకు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. గత రెండు నెలలుగా అక్రమ రవాణా చేస్తూ ఆదాయం గడిస్తుండడంతో అందరూ మట్టిపై కన్నేశారు. దీంతో వర్గాలుగా ఏర్పడి కుమ్ముకునే పరిస్థితి తలెత్తింది. బుధవారం ఒంటిమిట్టలో చమర్తి జగన్ మోహన్‌రాజు వర్గానికి చెందిన వారు టిప్పర్‌తో మట్టి తోలేందుకు చెరువులోకి వెళ్లగా.. మేడా విజయశేఖర్‌రెడ్డి (బాబు) వర్గానికి చెందిన వారు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ అధికారుల ఆదేశాల మేరకు ఒంటిమిట్ట సీఐ బాబు మట్టి తవ్వకాలు అడ్డుకొని అందరినీ చెరువులో నుంచి బయటకు పంపారు. అనుమతులు లేని టిప్పర్‌లను స్వాధీనం చేసుకోలేదు. చమర్తి-మేడా బాబు వర్గీయుల మధ్య ఆధిపత్య పోరుతో బుధవారం ఒంటిమిట్ట చెరువులో మట్టి రవాణా అనుమతుల కోసం ఘర్షణ జరిగిందని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. కడప ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లిన మేడా విజయశేఖర్ రెడ్డి వర్గీయులపై చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గీయులు దాడి చేశారని, అది మనస్సులో పెట్టుకొని స్థానిక హరిత హోటల్ వద్ద చమర్తి జగన్ మోహన్ రాజు వర్గీయులపై మేడా విజయశేఖర్‌రెడ్డి వర్గీయులు ప్రతిదాడి చేశారని తెలిపారు. ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌లో ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకున్నామని, మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా 12 మందిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఇరిగేషన్ ఈఈ వెంకటరామయ్యను వివరణ కోరగా టిప్పర్‌లకు అనుమతులు లేదని, నేటి నుంచి ఒంటిమిట్ట చెరువులో మట్టి రవాణా అనుమతులను రద్దు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తండ్రీ కొడుకులపై కేసు నమోదు

పెనగలూరు : మండలంలో మంగళవారం రాత్రి జరిగిన సంఘటనలో తండ్రీ, కొడుకులపై రెండు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రాజంపేట మండలం బోయనపల్లికి చెందిన శివశంకర్‌రెడ్డి, ఆయన కుమారుడు వర్షిత్‌రెడ్డి నెల్లూరుకు కారులో బయలుదేరారు. రాత్రి చక్రంపేట సమీపంలోని సాయి వికాష్ స్కూల్ వద్ద స్కూటర్‌ను ఢీకొనడంతో పూజారికి గాయాలయ్యాయి. చక్రంపేట జెడ్పీ హైస్కూల్ వద్ద ఆటోను అదే కారు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కొంతమంది బెస్తపల్లి వద్ద కారు ఆపి స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఇరువురినీ పోలీసుస్టేషన్‌కు తీసుకురాగా స్టేషన్ వద్ద వీరంగం సృష్టించారు. దీంతో రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.